అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
సోమవారం 30 జనవరి 2023

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-నేరడిగొండ

వెనుక నుంచి వచ్చి ఆటోను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని దుద్‌గండిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుద్‌గండి బస్టాండ్ సమీపంలో 44వ జాతీయరహదారిపై వాంకిడి గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్(28) ఆటో డ్రైవర్ నేరడిగొండ నుంచి వాంకిడికి తిరుగు ప్రయాణంలో దుద్‌గండి వద్ద వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో అదుపుతప్పి ఆటో రోడ్డుపై నుంచి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ షేక్ ఇర్ఫాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో రాజకుమార్, ఈశ్వర్‌లకు గాయాలయ్యాయి.

మాదాపూర్‌లో పట్టపగలే దొంగలు

- యువకులు వెంబడించడంతో పరారీ

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఆదివారం పట్టపగలే ముఖానికి మాస్కు, దస్తీలు కట్టుకుని ఓ ఇంట్లోకి చొరబడ్డారు. మహిళలు కేకలు వేయడంతో గ్రామ యువకులు వారిని వెంబడించగా, హెచ్‌ఎఫ్ డీలక్స్ మోటార్ బైక్‌పై పొన్న గ్రామం వైపు వెళ్లినట్లుగా గ్రామస్తుడు మహిమూద్ తెలిపారు. గ్రామంలోని ఓ కిరాణ కొట్టులో సీసీ పుటేజీల్లో కన్పించడంతో వారి కోసం యువకులు, గ్రామస్తులు గాలిస్తున్నారు. సీఐ ముదావత్ నైలు, ఎస్సై నీరేష్ ప్రత్యేక పోలీసు బలగాలతో పకడ్బంది గస్తీ నిర్వహిస్తున్నారు. ప్రజలు ధైర్యంతో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

బాబోయ్ దొంగలు..!

- జిల్లాలో వరుస ఘటనలతో కలవరం
- గ్రామాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో ఆందోళన
- అంతరాష్ట్ర ముఠాగా అనుమానిస్తున్న పోలీసులు
- రాత్రిల్లో అలర్ట్‌గా ఉండాలని గ్రామస్తులకు సూచన

ఆదిలాబాద్ జిల్లాలో దొంగల సంచారం జనాల్లో భయాందోళన రేకెత్తిస్తోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వారం రోజులుగా వరుస ఘటనలు జరుగుతుండటంతో కలవరపడుతున్నారు. ఎక్కడ్నుంచి వచ్చి ఇండ్లు దోచెస్తారోనని భయంభయంగా గడుపుతున్నారు. దొంగలు ఒకే చోట కాకుండా రెండు, మూడు రోజుల వ్యవధిలో వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు యత్నించడంతో ఆయా ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన దొంగతనం మినహా ఇచ్చోడ, పొచ్చర, దీపాయిగూడలో జరిగిన ఘటనల్లో బయటి ముఠాల ప్రమేయం ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామాలతో పాటు పట్టణ శివారు ప్రాంతాల ప్రజలు కూడా అలర్ట్‌గా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఇచ్చోడ

ఆదిలాబాద్ జిల్లాను దొంగల భయం వణికిస్తోంది. గత వారం రోజులుగా వివిధ ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్న వరుస ఘటనలు కలకలం రేపుతున్నాయి. కేవలం వారం రోజుల వ్యవధిలోనే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు జరగడం జిల్లా ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రస్తుత ఘటనలు ఒకే ప్రాంతంలో కాకుండా వేర్వేరు చోట్ల జరగడం మరింత భయాన్ని కలిగిస్తోంది. ఏ రోజున ఎక్కడ దొంగతనం జరుగుతోందనని జనాలు ఆందోళన చెందుతున్నారు. ఈ చోరీ ఘటనలు ఎక్కువగా రోడ్డుకు దగ్గరగా ఉన్న గ్రామాలు, పట్టణ శివారు ప్రాంతాలే లక్ష్యంగా జరగడంతో బయటి ప్రాంతాల నుంచి వచ్చిన దొంగల ముఠాగానే పోలీసులు అనుమానిస్తున్నారు. తాజాగా పొచ్చరలో సంచరించిన దొంగల ముఠా ఇది వరకు మహబూబ్‌నగర్‌లోనూ ఇదే తరహా చోరీకి యత్నించినట్లు తెలుస్తోంది. సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన వీడియోలను పరిశీలించిన పోలీసులు ఈ రెండు చోట్ల సంచరించిన ముఠా ఒకటేనని భావిస్తున్నారు. జిల్లామీదుగా రైల్వేలైన్ ఉండటంతో పాటు 44వ జాతీయ రహదారి సైతం అనుకూలంగా ఉండటం దొంగలకు సులువుగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క మహారాష్ట్ర ప్రాంతం సైతం దగ్గరగా ఉండటం ఆ ప్రాంతాల నుంచి కూడా వస్తున్నట్లు స్థానిక ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క నిర్మల్ జిల్లాలో కిందటివారం వరుస చోరీ ఘటనలు చోటుచేసుకోవడంతో తాజా పరిస్థితుల దృష్ట్యా అక్కడి పోలీసులు సైతం జిల్లావాసులను అప్రమత్త చేశారు.


ఇటీవల సీసీ పుటేజికి చిక్కిన చెడ్డీ గ్యాంగ్

గ్రామాల్లో గస్తీ..!

జిల్లాలో దొంగల సంచారం ఆయా ప్రాంతాల ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. వరుసగా ఏదో ఒక ప్రాంతంలో దొంగలు సంచరిస్తున్నట్లు సమాచారం వస్తుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తమయ్యారు. దొంగల ముఠా సంచరిస్తోందని అలర్ట్‌గా ఉండాలని పోలీసులు సైతం సూచిస్తుండటంతో ఆయా గ్రామాల్లో ప్రజలు రాత్రి వేళలో గస్తీ తిరుగుతున్నారు. గ్రామస్తులంతా ఏకమై వంతుల వారీగా రాత్రి వేళలో కాపలా ఉంటూ గ్రామాలను దొంగల బారి నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు.

జిల్లాలో వరుస ఘటనలు ఇవి

- ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం దీపాయిగూడలో అయిదు రోజుల క్రితం రెండు ఇండ్లలో దొంగలుపడ్డారు. ఒక ఇంట్లో 13 తులాల బంగారం, రూ.20వేల నగదు ఎత్తుకెళ్లగా..మరో ఇంటిలో ద్విచక్రవాహనం చోరికి గురికావడంలో ఆ గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలను భయకంపితులను చేస్తోంది.
- ఇచ్చోడ మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం రాత్రి వేళలో దొంగలు రెండు ఇళ్లలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. తలుపులు పగలగొట్టి సొత్తు దోచుకునేందుకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు అలర్ట్ అయి కేకలు వేశారు.దీంతో చుట్టుపక్కల వారు లేచి వచ్చే సరికి దొంగలు పారిపోయారు. తాజాగా ఇదే మండలంలోని మాదాపూర్‌లో ఆదివారం సాయంత్రం ఇద్దరు దొంగలు ద్విచక్రవాహనంపై వచ్చి ఓ ఇంట్లో దొంగతనానికి యత్నించారు. గ్రామస్తులు అప్రమత్తమయ్యే సరికి పారిపోయారు.
- బోథ్ మండలం పొచ్చర గ్రామంలో నలుగురు సభ్యుల దొంగల ముఠా గ్రామంలో సంచరించింది. ఓ ఇంటిలో దొంగతనం చేసేందుకు ప్రయత్నించినట్లు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. ఇదే రోజున ఓ ద్విచక్ర వాహనం మాత్రం చోరికి గురైంది. సదరు వాహనం ఆదిలాబాద్‌లోని ఓ ప్రాంతంలో లభ్యమైంది.
- ఆదిలాబాద్ పట్టణం న్యూహౌసింగ్‌బోర్డులో మూడు రోజుల క్రితం శేకన్న అనే వ్యక్తిలో ఇంటిలో దొంగతనం జరిగింది. ఏకంగా 19 తులాల బంగారం, 30తులాల వెండి అపహరణకు గురైంది.


ఇచ్చోడలో తనిఖీ చేస్తున్న డాగ్‌స్కాడ్ బృందం

అనుమానం వస్తే సమాచారం అందించాలి

డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్పీ, ఆదిలాబాద్



జిల్లాలో దొంగల సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వారిని పట్టుకోవడానికి 25 పోలీసు బృందాలు రాత్రి వేళలో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అనుమానిత వ్యక్తులు సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. డయల్ 100కు ఫోన్ చేయగానే పోలీసులు వెంటనే వస్తారు. గ్రామాలు, పట్టణ శివారు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పోలీసులు సైతం ఆయా గ్రామాల్లోకి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు.

రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్

నవతెలంగాణ-బోథ్

రైతులు పండించే పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని షాదీఖానాలో బోథ్ సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు పట్టించుకోవటం లేదని అన్నారు. అలాగే మండల కేంద్రంలోని ఫైర్ స్టేషన్, డిగ్రీ కళాశాల, కోర్టు భవనం ఏర్పాటు చేయక ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉందని అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, పత్తికి రూ.15వేలు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సివిల్ సప్లై కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నళిని రెడ్డి, సిర్ర దేవేందర్, భాస్కర్, కేశవ్, భోజన్న పాల్గొన్నారు.

సీపీఐ నియోజకవర్గ నూతన కార్యవర్గం మండల కేంద్రంలోని షాదీఖానాలో ఏర్పాటు చేసిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో అనంతరం బోథ్ నియోజకవర్గం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ కార్యదర్శిగా భరతాల గోవర్ధన్, సహయ కార్యదర్శిగా శ్రీనివాస్ యాదవ్, కోశాధికారి చిలుకా దేవిదాస్‌లను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా షేక్ సాకీర్, గోదావరి, సిరిపురం దాస్, నరేష్, సత్యనారాయణ, కన్నేపల్లి గంగయ్య ఉస్మాన్, సతీష్, రతన్, అశోక్, రమేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీ

నవతెలంగాణ-సిరికొండ

ఆదివాసుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంపీ సోయం బాపురావ్ అన్నారు. ఆదివారం మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన ఫకీర్‌పేట్ గ్రామం నుండి పెంబి మండలం పులగం పాండ్రి గ్రామం వరకు మట్టి రోడ్డు నిర్మాణానికి ఎంపీ నిధులతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమాయక ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా పని చేస్తుందని అన్నారు. అడవిలోని జంతువులపై ఉన్న ప్రేమ ఆదివాసులపై లేకుండా, కనీసం రోడ్లకు అనుమతులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ మోసం చేస్తోందని అన్నారు. ఈ మట్టిరోడ్డు వల్ల రెండు జిల్లాల రవాణా వ్యవస్థ మెరుగు పడుతుందనీ అన్నారు. ఒకవేళ ఈ పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటే మనమంత కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేయడానికి సిద్ధంగా ఉండాలని వారిని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా కేవలం ఓట్ల కోసమే రాష్ట్ర ప్రభుత్వం డ్రామాలు చేస్తుందని అన్నారు. నాగోబా జాతరలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మాట్లాడకుండ కేంద్ర ప్రభుత్వం పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. జిల్లాలో అనేక అటవీ ప్రాంతాలలో త్వరలోనే సెల్ టవర్ల నిర్మాణాలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమృత్ రావ్, కో ఆప్షన్ సభ్యుడు కాగ్నే మాణిక్ రావ్, నాయకులు ఖానాపూర్ నియోజక వర్గ నాయకులు, అయా గ్రామాల సర్పంచ్‌లు జమున, హరిలాల్, రఘురాం, జగన్, మండల అధ్యక్షుడు అమూల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పల్లి(బి) గ్రామస్తులు

నవతెలంగాణ-తలమడుగు

పల్లి(బి) గ్రామస్తులు ఆదివారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ గ్రామంలో డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు అయ్యే ఖర్చు మొత్తం ఎమ్మెల్యే నిధుల నుంచి కేటాయిస్తామని అన్నారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి : వైయస్సార్‌టీపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేస్తూ ప్రజ సమస్యలపై ఉద్యమించాలని వైయస్సార్‌టీపీ రాజకీయ కార్యాచరణ కమిటీ సభ్యులు రామచంద్రరావ్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో పార్టీ ముఖ్య కార్యకర్తల ఉమ్మడి జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅథితిగా హాజరై పార్టీ సంస్థగత బలోపేతంపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో వైఎస్ పాలనను మళ్లీ అందించడానికి ఆయన తనయి వైఎస్ షర్మిల తెలంగాణలో పార్టీని స్థాపించారని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ కార్యాచరణ కమిటీ సభ్యులు నీలం రమేష్, కవిత, పార్టీ నాయకులు అనిల్ కుమార్, శాంతి కుమార్, పెందూర్ మనోహర్, దుర్గం నగేష్, లోక లక్ష్మారెడ్డి, గోవింద్ నాయక్, అస్లం పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

నవతెలంగాణ-జైనూర్

గ్రామీణ ప్రాంతంలో బీజేపీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరు తనవంతు కృషి చేయాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి సొల్లు లక్ష్మి, మండల అధ్యక్షుడు కొట్నాక దౌలత్‌రావుఅన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయం ఆవరణలో పార్టీ సభ్యులతో కలిసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో జైనూర్ ఉపాధ్యక్షుడిగా రాథోడ్ ధర్మేందర్, మెస్రం గోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మెస్రం జ్ఞానేశ్వర్, ప్రవీన్‌కుమార్, కార్యదర్శిగా కుమ్ర దేవ్‌రావు, రాథోడ్ గణేష్, కోశాధికారిగా మడావి నాగోరావు, కుమ్ర నగేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

అపూర్వం.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం..

నవతెలంగాణ-రెబ్బెన

అపూర్వం ఆ పూర్వ విద్యార్థుల సమ్మేళనం. 30 యేండ్ల తరువాత అందరూ ఒక చోట చేరి వారి చిన్ననాటి జ్ఞాపకాలను నేమరు వేసుకున్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి పాఠశాలలో ఆదివారం మహా సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటగా గోలేటి టౌన్‌షిప్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తా నుండి భారీగా ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ చౌరస్తా నుండి సీఈఆర్ క్లబ్ వరకు బతుకమ్మలు, గుస్సాడీ నృత్యాలతో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం 30 యేండ్ల జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకొని ఆనందం వ్యక్తం చేశారు. 1983 నుండి 2023 పాఠశాలలో చదివిన 200 మంది ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, 2 వేలకుపైగా విద్యార్థులు పాల్గొని జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు పలుకరించుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ శాలువాలతో, అదేవిధంగా జ్ఞాపికను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌లతో సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంఘ కార్యక్రమాల్లో నిమగ్నమవ్వాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం కార్యక్రమాల్లో కార్యవర్గం నిమగ్నమవ్వాలని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశలత అన్నారు. పట్టణం, మండలంలో మహిళా బృందంతో ఆదివారం ఆమె పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి, సాంఘిక, రాజకీయ, ఆర్థిక హక్కుల సమానత్వం కోసం పోరాడాలన్నారు. ఇల్లు, ఇంటి స్థలాల సమస్య ఉన్నవారిని గుర్తించేందుకు సర్వే చేయాలని, ఫిబ్రవరి 3న మున్సిపల్ అధికారులకు అప్లికేషన్ ఇవ్వాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, ఇందుకు ఫిబ్రవరి 9న ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించాలన్నారు. ఐద్వా రాష్ట్ర నాయకురాలు మస్తాన్‌బీ మాట్లాడుతూ సంఘాలు తమకున్న అవకాశాన్ని బట్టి నిర్ణయించుకోవాలని, సమయం తక్కువగా ఉన్నందున తక్షణం తగిన కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించి, పని జరిగేటట్టు చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అనిత, సభ్యులు గేడం లక్ష్మీ, మమతా మండల్, కాజల్ మండల్, పింకీ బారయి, సమంత మండల్, సునీత మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సమాజ రక్షణ కోసమే పోలీసులు

- కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సమాజ రక్షణ కోసమే పోలీసులు పని చేస్తున్నారని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు అన్నారు. 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో భాగంగా రూరల్ ఎస్సై సోనియా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మండలంలోని మారుమూల గ్రామం దరిగాంలో 70 కుటుంబాలకు ఒక్కొక్కరికి 10 కేజీల చొప్పున ఏడు క్వింటాళ్ల బియ్యం, దుస్తులు, దుప్పట్లు, నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణి చేశారు. సీఐ నాగరాజు మాట్లాడుతూ ఆదివాసీలు తమకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. పోలీసులు నిరంతరం ప్రజలతో మమేకమై ఉంటారని, శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు. పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, ఏ సమస్య ఉన్న పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు లోను కావద్దని సూచించారు. అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించవద్దన్నారు.

ముగిసిన హెమన్‌డార్ఫ్ క్రీడా పోటీలు



నవతెలంగాణ-జైనూర్

గత 45 రోజుల నుంచి నిర్వహించిన హైమన్‌డార్ఫ్, బేటీఎలిజబెత్ స్మారక క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. క్రికెట్ ఫైనల్ పోటీలో జైనూర్ సాదిర్ ఎలెవన్ స్టార్ మొదటి బహుమతి సాధించగా రెండో బహుమతి కెరమెరి ఎలెవన్ స్టార్ జట్టు సాధించడంతో పాటు మూడో బహుమతి హీరాపూర్ క్రికెట్ జట్టు గెలుపొందింది. ఈ సందర్భంగా మార్లావాయి గ్రామ పంచాయతీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఆదివాసుల ఆత్మీయ బంధువైన ప్రొఫేసర్ హైమన్‌డార్ఫ్, బేటీఎలిజబెత్ దంపతుల వర్ధంతి కార్యక్రమంలో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న యువతను ప్రోత్సహించడానికే క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్రీడా పోటీలో కబడ్డీ, వాలీబాల్ లాంటి క్రీడలు నిర్వహించామన్నారు. అందులో సుమారు 70 టీంలు క్రీడా పోటీలో పాల్గొన్నట్టు తెలిపారు. పోటీపోటీగా క్రికెట్ పోటీలు జైనూర్ మండలానికి చెందిన సాదిర్ ఎలెవన్ స్టార్‌కు రూ.20 వేలు నగదు బహుమతితో పాటు ప్రత్యేక ట్రోఫీని అందజేసినట్టు తెలిపారు. అదేవిధంగా రెండో బహుమతిగా కెరమెరి ఎలెవన్ స్టార్‌కు రూ.10 వేలు, మూడో బహుమతిగా హీరాపూర్‌కు రూ.5 వేలు బహుమతులు అందజేసినట్టు తెలిపారు. హైమన్‌డార్ఫ్, బేటీఎలిజబెత్ క్రికెట్ పోటీలో మ్యాన్ ఆఫ్ ది సిరిస్‌గా మోసిన్‌ఖాన్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సచిన్‌తో పాటు బెస్ట్ బాలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ ఎంపైర్ బహుమతులు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సార్‌మేడి జుగనాక దేవ్‌రావు, ఉప సర్పంచ్ జుగునాక సావిత్రి, ధర్మారావు, గ్రామపటేల్ ఆత్రం మాణిక్‌రావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని విజయనగరం సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాలలో 1997 -1998 సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో అప్పటి ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి సమ్మేళనం నిర్వహించారు.10వ తరగతి పూర్తి అయి 25 సంవత్సరాలు గడిచిన సందర్భంగా వారు సిల్వర్ జూబ్లీ నిర్వహించారు. ఉపాధ్యాయులు చూపిన సన్మార్గంలో వారికి కలిగిన ప్రయోజనాలు వారి అనుభవాలను, అనుభూతులను వివరించారు. గరువులు నేర్పిన క్రమశిక్షణ తమను ఈరోజు ఉన్నత స్థానంలో నిలబడేలా చేసిందన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో కాసేపు కాలక్షేపం చేశారు. అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయులు ఫాదర్ మత్తయి ఫాదర్ జేమ్స్ దుండియల్‌తో పాటు ఉపాధ్యాయులను సన్మానించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు.

మున్నూరుకాపు మండల అధ్యక్షుడిగా అగ్గి సత్తయ్య

నవతెలంగాణ-కాసిపేట



మున్నూరు కాపు సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక రసవత్తరంగా సాగింది. ఆదివారం సోమగూడెం ఫంక్షన్‌హాల్‌లో కాసిపేట మండల మున్నూరు కాపు అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ఎన్నికలో అధ్యక్షులుగా ముగ్గురు అభ్యర్థులు అగ్గి సత్తయ్య, ఇంగు నారాయణ, అగ్గి వెంకటేశ్వర్లు ఎన్నికల బరిలో నిలిచారు. దింతో ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహించగా సభ్యులు తమ ఓటు హక్కు వినయోగించుకున్నారు. బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించిన ఈ ఎన్నిక సాధారణ ఎన్నిక విధంగా తలపించింది. ఈ ఎన్నికల బరిలో అగ్గి సత్తయ్య 67 ఓట్లతో కాసిపేట మండల అధ్యక్షుడిగా గెలుపొందారు. అగ్గి సత్తయ్య అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు. భారీ మెజార్టీతో అగ్గి సత్తయ్య గెలుపుతో విజయోత్సవ సంబరాలు చేశారు.

నిఘా నేత్రాలు బాగు చేయించాలని వినతి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలో ఇదివరకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బాగు చేయించాలని యువ చైతన్య యువజన సంఘం సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువ చైతన్య యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో దొంగల బీభత్సం మండల ప్రజలను భయాందోళనకు గురి చేస్తుందని అన్నారు. గ్రామాల్లో మండల కేంద్రంలో పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ అన్ని సీసీ కెమెరాలు పనిచేసే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పెట్రోలింగ్‌లో యువజన సంఘాలు కూడా పాల్గొంటామని తెలిపారు. విడతలవారీగా రోజు పది మంది యువకులు రాత్రులు గస్తీ నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం ఉపాధ్యక్షులు బలేరావ్ నాగేష్, సంఘం సభ్యులు కంగర్ల ప్రశిత్ కుమార్, పడిపెల్లి ధనుంజయ్, బంజా విశ్వేశ్వర్, అల్కే ఉదయ్, బంటి పాల్గొన్నారు.

మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరిస్తూ వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. పట్టణంలోని టీఎన్‌జీవోస్ భవనంలో ఆదివారం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులతో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ల్యాబ్ టెక్నీషియన్‌లుగా పని చేసే వారు పదవీ విరమణ పూర్తయ్యేంత వరకు అదే హోదాలో ఉండేవారని అన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నూతన మెడికల్ కాలేజ్‌లను ప్రారంభించడంతో వారికి ప్రమోషన్ల సౌలభ్యం లభిస్తోందని వివరించారు. ఉద్యోగుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి వాటిని త్వరలోనే పరిష్కరించే దిశగా అన్ని చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి నవీన్, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరుకున్న నిరసన

- రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పనిచేస్తున్న 300 ఓసీఎస్ స్టాఫ్ నర్స్‌ల 8 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని, కంటిన్యూయేషన్ లెటర్లను ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కుమార్ అన్నారు. ఆదివారం రిమ్స్ ఎదుట తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత ఇతర సమస్యలు పరిష్కరించాలని తదితర డిమాండ్లతో చేపట్టిన నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందని అన్నారు. రిమ్స్‌లో 300 ఓసీఎస్ స్టాఫ్ నర్సులు 42 మంది ప్రభుత్వ కాంట్రాక్టులో గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నారని అన్నారు. కరోనా కష్టకాలంలోనూ ఫ్రంట్ లైన్ వారియర్లుగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారని అన్నారు. ప్రభుత్వం మాత్రం వీరితో వెట్టి చాకిరీ చేయించుకుంటే తప్ప సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదని మండిపడ్డారు. 11వ పీఆర్సీ విషయంలోనూ సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా వీరికి తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. తక్కువ వేతనాలను చెల్లిస్తూ వాటిని కూడా ప్రతినెలా సక్రమంగా చెల్లించకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందన్నారు. గత ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వీరందరూ ఇతర ప్రాంతాల జిల్లాల నుండి వచ్చి ఇక్కడ సేవలందిస్తున్నారని 8నెలలుగా వేతనాలు చెల్లించకుండా వీరి కుటుంబాలను ఎట్లా పోషించుకోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికై రిమ్స్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్, డీఎంఈ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని పలు సందర్భాల్లో కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. జిల్లా అధికారులు డీఎంఈ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే స్పందించి 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని, ఎటువంటి షరతులు లేకుండా 300 ఓసీఎస్ కింద పని చేస్తున్న స్టాఫ్ నర్సుల అందరినీ రెగ్యూలర్ చేయాలని సమాన పనికి, సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, సహాయ కార్యదర్శి పెర్క దేవిదాస్, నాయకులు సుమన్ తాయి, సుభాష్ స్టాఫ్ నర్స్‌లు రాజ్యలక్ష్మి, కమల, మీనాక్షి, సురేఖ, శ్రీలత, కృష్ణకుమారి, అరుణ, పెర్సి, విశాల పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల్లో పారదర్శకత పాటించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల్లో పారదర్శకత పాటించేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్‌లు డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీతను ఆదివారం డీఈఓ కార్యాలయంలో కలిసి ప్రాతినిధ్యం చేసి మాట్లాడారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల సీనియారిటీ జాబితాలు సకాలంలో, తప్పులు లేకుండా రూపొందించాలన్నారు. అర్హులైన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్య కుమార్, కోశాధికారి కె.కిష్టన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు సి.లక్ష్మణ్ రావ్, జిల్లా కార్యదర్శులు సి.విలాస్, కె.గణేష్, కె.శంకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రానికి చెందిన పులి గంగాధర్(30) పురుగులమందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడు గంగాధర్ భార్య లక్ష్మీతో కలిసి మండలంలోని తాండ్ర(జి) గ్రామంలో పశువులు కాస్తు జీవిస్తున్నారు. కొన్ని రోజులుగా భార్యభర్తల మధ్య మనస్పర్ధాలు ఏర్పడి భార్య లక్ష్మి తన పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి గురైన గంగాధర్ గురువారం పశువులు మేపడానికి వెళ్లి అక్కడే పురుగులమందు తాగి కుటుంబీకులకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబీకులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో పడి ఉన్న గంగాధర్‌ను నిర్మల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుని తల్లి పోసాని, ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతినికి భార్య లక్ష్మి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గ్రామదేవతలే గ్రామాలకు రక్ష : మఠాధిపతి

- బద్ది పొచ్చమ్మ ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామదేవతారాధన కులమతాలకతీతంగా ప్రాంతాల కతీతంగా జరగాలని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీ యోగనంద సరస్వతి అన్నారు. ఈ సందర్భంగా వేములవాడ బద్ది పోచమ్మగా ప్రసిద్దిగాంచిన ఆదిలాబాద్ పట్టణంలోని కోలిపుర బద్ది పోచమ్మ ఆలయం అభివృద్ధి, ప్రచారాన్ని కాంక్షిస్తూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగానే ఆదివారం బద్ది పోచమ్మ ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టాగా గోపాలకృష్ణ మఠాధిపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా బద్దీ పోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాలలో వెలసిన గ్రామదేవతలకు సదాచారంతో సేవలు చేస్తే కొన్ని తరాల వరకు వారి కుటుంబ సంరక్షణ బాధ్యత అమ్మవారు చూసుకుంటుందని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సిబ్బందితో భక్తులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు దశరథ్ పటేల్, బెల్లూరి అయ్యప్ప ఆలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యకాంత్, రవీందర్, బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి కార్యసాధకులు గాజరి చంద్రశేఖర్, ప్రభాకర్ లింగం, రాచర్ల సంతోష్, రాకేష్ గుండావార్, రవీందర్ గౌడ్, గాజరి శ్రీకాంత్, రాహుల్, అనిల్ పాల్గొన్నారు.

స్పైనల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆవరణలో స్పైనల్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ మాట్లాడుతూ గత 10 వారాలుగా సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం తమ వంతుగా పేదలు, నిస్సహాయులైన 300 మందికి కడుపు నింపడం చాలా సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు గొర్లవార్ రాకేష్, భూరె సురేష్, రామకృష్ణ, విశాల్, రాజు, మోతిలాల్ పాల్గొన్నారు.

జాతరలో 108 సేవలు భేష్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఈ నెల 21 నుంచి 28 వరకు జరిగిన నాగోబా జాతరకు 108 సేవలు అభినందనీయమని ప్రాజెక్ట్ మేనేజర్ సామ్రాట్ జనార్ధన్ అన్నారు. ఆదివారం కేస్లాపూర్ జాతరలో 108 సేవలను పరిశీలించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట కొండల్‌రావ్, శ్రీకాంత్, ఈఎంటీ కాశీనాథ్, పైలట్ ఆత్రం అశోక్, గోపీనాథ్ పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-తాంసి

మారుమూల గ్రామాల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం భీంపూర్ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని అన్నారు. వడూర్ గ్రామ సమీపంలోని బైరవ గుట్ట ప్రహరీ నిర్మాణం రూ.30 లక్షలు, కరంజి(టి)లో రూ.20 లక్షలతో నిర్మించే గోదాం నిర్మాణానికి, గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో 17 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కొజ్జన్ గూడ, టెక్డిరాంపూర్ గ్రామంలో పర్యటించి, గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సమావేశంలో టెక్డిరాంపూర్ గ్రామానికి చెందిన 50 మంది గ్రామస్తులు బీఆర్‌ఎస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులను చేపట్టడానికి ప్రత్యేకంగా నిధులను అందజేస్తున్నామని అన్నారు. ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మీ పథకం ద్వారా అండగా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, వైస్ ఎంపీపీ లస్మన్న, రైతుబంధు మండల అధ్యక్షుడు అనిల్, ఆర్ఐ శారద, గ్రామ సర్పంచ్‌లు హనుమాన్‌దాస్, నరేందర్, ప్రతాప్, గంగారాం, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్, నాయకులు రవూఫ్, రాజన్న, రమణ ఉన్నారు.

ప్రజలను మోసం చేసి గెలిచారు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపిస్తూ 2014, 2018లో ప్రజలను మోసం చేసి గెలిచారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం క్రాంతినగర్‌లో ఏర్పాటు చేసిన జాయినింగ్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కాలనీకి చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, పార్టీకి చెందిన నాయకులు, యువకులు, మహిళలు విశ్రాంత ఉద్యోగులు పలువురు కాలనీ వాసులు బీజేపీ జిల్లా అధ్యక్షుడి సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు విడుదల చేస్తే అభివృద్ధి పనులు ఎక్కడ చేశారో లెక్కలు చూపాలని కోరితే ఒక్క నాయకుడు ముందుకు రావడం లేదన్నారు. పట్టణంలోని తాంసి బస్టాండ్ వద్ద 2018లో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ కోసం రూ.70కోట్ల నిధులు రాష్ట్రానికి కేంద్రం విడుదల చేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.30 కోట్లు ఇవ్వకుండా జాప్యం చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ గల్లీ నాయకులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రౌడీయిజం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. చోట నాయకులైతే ఏకంగా ప్రజలను భయపెడుతూ మీరు బీజేపీలో చేరితే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలను మీకు రాకుండా చేస్తామని బెదిరిస్తున్నారన్నారని ఆరోపించారు. కేంద్రం పేదల కోసం ఎన్నో పథకాలను అందిస్తే, కేసీఆర్ ప్రభుత్వం అందులో చేరనందున ప్రజలు ఎన్నో విధాలుగా నష్టపోతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆదినాథ్, వేణుగోపాల్, దినేష్ మటోలియా, లాలా మున్న, జోగురవి, రాజేష్, శ్రీనివాస్, ధోని జ్యోతి, సునందరెడ్డి, పద్మ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-ఖానాపూర్

ఎమ్మెల్యే రేఖా నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఆమె నివాసంలో ఆయా పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కడెం మండలానికి చెందిన మీసాల సత్తన్న, తన అనుచర వర్గం బీఆర్‌ఎస్‌లో చేరారు. అధికార పార్టీ చేపడుతున్న ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కడెంకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, నాయకులు ప్రజా ప్రతినిధులు ఏఆర్‌ఎస్ అభిమానులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-జైనథ్

లయన్స్ క్లబ్ అఫ్ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని జునాపని, కొలాంగూడ గ్రామంలో 100 మంది వృద్దులకు, స్త్రీలకు బ్లాంకెట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మెన్ రమాకాంత రావు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా రెండో స్వచ్ఛంద సంఘంగా గుర్తింపు పొందిన లయన్స్‌క్లబ్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. నేడు ఈ గ్రామానికి రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.వినోద్ దేశ్‌పాండే, లయన్స్ క్లబ్ అధ్యక్షులు విశ్వస్, ప్రకాష్, కార్యదర్శి అశోక్, ట్రెజరర్ కరీం అలీ, అనంత్ దేశ్‌పాండే, దయానంద్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కాంతాబాయి మోహన్, ఎంపీటీసీ భరత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి యువకుల చేరిక

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పలువురు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న హజరయ్యారు. ఆదివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవీంద్రనగర్ కాలనీకి చెందిన గణేష్ నాయుడుతో పాటు పలువురు నాయకులు, యువకులు ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలు, గ్యాస్, పెట్రో ధరలను అమాంతంగా పెంచి పేదల నడ్డి విరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు రామ్, పార్టీ నాయకులు ఉన్నారు.

గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని కనకపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 25 అడుగుల గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఆదివారం రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ మనువడు భారతీయ బౌద్ధ మహాసభ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు బీఆర్ యశ్వంత్ రావు అంబేద్కర్, ముథోల్ ఎమ్మెల్యే జి.విఠల్ రెడ్డి, బౌద్ధ బిక్షువులతో కలిసి అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామ, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కుంటాల జలపాతాన్ని సందర్శించిన శిక్షణ ఎఫ్‌బీఓలు

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుంటాల జలపాతాన్ని ఆదివారం తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ 32వ బ్యాచ్‌కు చెందిన 40 మంది శిక్షణ ఎఫ్‌బీఓలు సందర్శించారు. వీరికి సెక్షన్ ఆఫీసర్ వసంత్, బిట్ ఆఫీసర్ సచిన్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన కుంటాల జలపాతం మొక్క విశిష్టతను, ఏకో డెవలప్‌మెంట్ కమిటీ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ సుభాష్ చంద్ర, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ భీమ్‌రావు, ఈడీసీ చైర్మెన్ నర్సయ్య, వాచర్‌లు పాల్గొన్నారు.

నాగోబా జాతర చివరి రోజు.. పోటెత్తిన భక్తులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన నాగోబా జాతర ఆదివారం చివరి రోజు కావడంతో భక్తులు పోటెత్తారు. జిల్లా ప్రజలే గాక వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నాగోబా దర్శనం కోసం బారులు తీరారు.

ఏసీడీ చార్జీలను ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

ఏసీడీ పేరుతో విద్యుత్ వినియోగదారులపై వేసే అదనపు చార్జీలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా జిల్లా కార్యదర్శి కే.రాజన్న ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులపై అడ్వాన్స్ కంజంప్షన్ డిపాజిట్ పేరుతో వేస్తున్న అదనపు భారాన్ని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు మరింత కష్టాల్లోకి కూరుకుపోయి విద్యుత్ వినియోగానికి దూరమవుతారని స్పష్టం చేశారు. సంక్షేమం పేరు చెప్పి ప్రగల్బాలు పలికే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్వాన్స్ పేరుతో వసూళ్లకు పూనుకోవడం దుర్మార్గమైన ప్రక్రియగా భావిస్తున్నామని అన్నారు. ఏసీడీ పేరుతో విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జిలను ప్రభుత్వం ఉపస హరించుకోవాలని డిమాండ్ చేస్తూ, 31న విద్యుత్ కార్యాలయాల ముందు జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని అన్నారు.

సమ్మెకు సీపీఐ(ఎం), టీఏజీఎస్ మద్దతు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పనిచేస్తున్న 300 ఓసీఎస్ స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని, వారికి చెల్లించాల్సిన 8 నెలల వేతనాలను చెల్లించాలని రిమ్స్ ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం రెండో రోజుకు చేరుకోగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ వారి సమ్మెకు మద్దత్తు తెలియ జేశారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం అవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఏజీఎస్ సంఘం జిల్లా కార్యదర్శి బైరి సోమేష్ జిల్లా ఉపాధ్యక్షులు లంక రాఘవులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆశన్న, కార్యదర్శి కిరణ్, నాయకులు దీపక్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-కడెం

మండలంలోని లింగాపూర్‌లో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అజ్మీర రేఖశ్యామ్ నాయక్ ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిగ్రామంలో, వార్డుల్లో సీసీ రోడ్డు నిర్మాణాలు చేస్తోందని అన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన కమ్మరి నర్సయ్య అనారోగ్యంతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి నర్సయ్యని పలకరించి, ఆరోగ్య విషయంలో తగు సూచనలు జాగ్రత్తలు తెలిపారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు జీవన్‌రెడ్డి నాయకులు ఆకుల లచ్చన్న, ఉప సర్పంచ్ రంజిత్ పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టమే మాలక్ష్యం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో బీజేపీ పటిష్టమే లక్ష్యంగా బూత్ కమిటీలను బలపరిచే విధంగా వెళ్తున్నామని మండల కన్వీనర్ కరిపే విలాస్ అన్నారు. ఆదివారం మండలంలోని హనుమాన్ తండ, కుప్టీ, ఇప్పచెలమ గ్రామపంచాయతీలో నూతన బూత్ కమిటీలు వేయడం జరిగిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో నిర్మల్ గడ్డపైన కాషాయ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చ అధ్యక్షులు జాదవ్ వినోద్, రాథోడ్ ఉమేష్, కార్యదర్శి సురేందర్ బూత్ అధ్యక్షులు ధన్‌రాజ్, అడే జ్ఞానేశ్వర్, నైతం గణపతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన పనులు

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన పనులు కొనసాగుతున్నాయి. పనులు తుది దశకు చేరుకోవడంతో విగ్రహానికి అందించడానికి గ్రామానికి చెందిన సంతోష్, సురేష్ కేంద్రే దాతలుగా నిలిచారు. విగ్రహ ధర మూడు నుంచి ఐదు లక్షల వరకు ఉంటుందని దాతలు ముందుకు రావడం అభినందనియమని అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం చౌక్ వద్ద దాతకు గ్రామ సర్పంచ్ రాథోడ్ మధుకర్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, గ్రామ మార్కెట్ కమిటీ సభ్యుడు కోటగిరీ విశాల్, ఉప సర్పంచ్ విష్ణు ఫడ్, గ్రామ పెద్దలు శాలువా కప్పి సన్మానించి, అభినందించారు. గ్రామంలోని అన్ని యూత్‌ల సభ్యులతో కలిసి చర్చించి, అన్ని హంగులతో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు శివాజీ యూత్ ప్రసిడెంట్ ఫడ్ రవీందర్ తెలిపారు. సన్మాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు జాదవ్ సూరజ్, ఉద్ధవ్ కెంద్రే, చకోర్ శివాజీ, సుభాష్, శ్రీనివాస్, రాంకిషన్, బాలాజీ, సురేష్, మహదవ్ పాల్గొన్నారు.

నలభై ఏండ్లకు కలిశారు



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో నలభై ఏండ్లకు ఒక చోట కలిశారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థుల్లో నూతనోత్సహాన్ని నింపింది. ఆ పూర్వ విద్యార్థులు అందరూ ఒక చోట కలిసేందుకు సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మొదటగా జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. విద్య బోధన చేసిన గురువులకు పూలమాలలతో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మరణించిన గురువులకు, తోటిమిత్రులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఒక్కోకరు మాట్లాడుతూ చదువుకునే సమయంలో చేసిన అల్లరి, చదువుల గురించి వివరించుకున్నారు. గురువులు నేర్పిన చదువు, క్రమశిక్షణతోనే ఈ స్థాయిలో ఉన్నామని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత విద్యాబుద్దులు నేర్పేది ఉపాధ్యాయులేనని కొనియాడారు. కష్ట సుఖాల్లో ఒకరికొకరు సహాయ సహకారాలు ఇచ్చి, పుచ్చుకోవడం స్నేహితులకే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గంగారెడ్డి, గంగారాం, జితేందర్ రెడ్డి, గంగారాం, సుకుమార్ పెట్కులే, సంతోష్, సుప్రియ, సుజాత, విలాస్, వినోద్ ఉన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఆరుగురుపై కేసు నమోదు చేసినట్టు టాస్క్ ఫోర్స్ సీఐ సుధాకర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని చిర్రకుంట గ్రామంలో మూడు పత్తాల ఆట (జూదం) ఆడుతున్న స్థావరంపై ఆదివారం దాడి చేశారు. మొత్తం ఆరుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి రూ.1590 మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్టు తెలిపారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని, గ్రామాలలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పాని, గ్రామాలలో పేకాట ఇతర ఏదైనా జూదం ఆడుతున్న సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ సీఐతో పాటు ఎస్సై సందీప్ కుమార్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల విజ్ఞాన యాత్ర

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు భానుప్రకాష్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులను కెరమెరి మండలంలోని జోడేఘాట్‌కు విజ్ఞాన యాత్రకు ఆదివారం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కుమురంభీం జీవిత చరిత్ర వివరించే మ్యూజియం చూపించారు. విజ్ఞానయాత్రకు వసుంధర డిగ్రీ కళాశాల యాజమాన్యం బస్సు సౌకర్యం కల్పించినట్టు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కారంపెల్లి పోశన్న, ఉపాధ్యాయులు యాదగిరి, శ్రీధర్, సమ్మయ్య, నాగేష్, కళావతి, భారతి, చంద్రశేఖర్, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక

నవతెలంగాణ-నస్పూర్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఉర్దూగర్ షాది ఖానాలో నిర్వహించిన సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షునిగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన డి.బ్రహ్మానందం రెండోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా సింగరేణి కాంట్రాక్టు కార్మికుల కోసం రాజీలేని పోరాటాలు చేసినట్టు తెలిపారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల హక్కుల కోసం, చట్టబద్ధ సౌకర్యాలకై ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంతో నిరంతర పోరాటాలలో ఉన్నామని అన్నారు. ప్రభుత్వము సింగరేణి యాజమాన్య జాతీయ కార్మిక సంఘాల విచ్ఛిన్నాలు, కుట్రలను అధిగమించి కార్మికుల్ని నిలబెట్టడంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అగ్ర భాగాన నిలిచిందని అన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ప్రత్యేక ఏజెండా విధి విధానాల రూప కల్పనకై కార్మిక వర్గాన్ని ఐక్యం చేస్తామని, నిరంతరం కార్మికులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఆదివాసులపై దాడి చేస్తే సహించేది లేదు

నవతెలంగాణ-వాంకిడి

అటవీ శాఖ అధికారులు ఆదివాసులపై దాడిచేస్తే సహించమని ఆదివాసీ భారత్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ రాజేష్ అన్నారు. మండలంలోని గోయగావ్ గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో రాజేష్ మాట్లాడారు. ఈ నెల 25వ తేదీన నార్నూర్ మండలంలోని నగల్‌కొండ గ్రామానికి చెందిన కోవ లింబారావు వంట చేసుకోవడానికి కట్టెల కోసం అడవికి వెళ్లగా అక్కడున్న అటవీ శాఖ సిబ్బంది దాడిచేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. లింబారావు అటవీ ప్రాంతంలో స్పృహ కోల్పోగా గ్రామస్తులు అతడిని గ్రామానికి తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించారని తెలపారు. ఇలాంటి దాడులు గతంలో కాగజ్‌నగర్ డివిజన్‌లోని కొలాంగోంది, దండెపెల్లి, కోయపోషగూడెం తదితర ప్రాంతాల్లో కూడా అటవీ శాఖ అధికారులు దాడులకుపాల్పడ్డారన్నారు. ఇప్పటికైనా దాడులు ఆపకపోతే తీవ్ర పరినామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి తిరుపతి, గ్రామస్తులు మడావి తెలంగ్‌రావు పటేల్, ఆత్రం ప్రభాకర్, ఆత్రం దౌలత్‌రావు, ఎస్‌కె బిలాల్, శబీర్, అనీల్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరుబాట



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

చెన్నూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పోరుబాట పట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. గెలిచిన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, మందమర్రి, రామకృష్ణాపూర్ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భీమారం లోని పోడు భూముల సమస్యలు పరిష్కరించాలన్నారు. సీపీఐ నాయకులు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ప్రజా పోరాటాలు చేయాలనీ పిలుపునిచ్చారు. అలాగే పార్టీ బలోపేతం చేయడానికి అన్ని మండలాల్లో పార్టీ ప్రజా సంఘాలు, పోలింగ్ బూతుల ఎజెంట్ సమావేశాలు, సోషల్ మీడియా బాధ్యులను నియమించి పార్టీ నిర్మాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్పకాయల లింగయ్య, బీమనాదుని సుదర్శన్, మిట్ట పెల్లి శ్రీనివాస్, నియోజకవర్గ కార్యదర్శి మిట్టపెల్లి పౌల్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు పెర్కసంపత్, పెండ్యాల కమలమ్మ, నక్క వెంకటస్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎండీ అక్బర్ అలీ, మందమర్రి పట్టణ కార్యదర్శి కామెర దుర్గా రాజు, మహిళ సమాఖ్య పట్టణ కార్యదర్శి గాజుల మనెమ్మ, మహిళ సమాఖ్య నాయకురాలు వజ్ర పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ జాతర

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని ఏదుల బంధం గ్రామంలో సోమవారం రోజున ముత్యాలమ్మ లక్ష్మి దేవర జాతర జరుగుతుందని సర్పంచ్ కొఠారి నిర్మలా, ఎంపీటీసీ జేకా శేకర్ తెలిపారు. ఈ సందర్భంగా చుట్టూ పక్కల భక్తులు నేడు బోనాలకు వచ్చి అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకోవాలని కోరారు. నాయక్ పోడ్ సంప్రదాయాల మధ్య పట్నాలు వేసి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది



నవతెలంగాణ-జన్నారం

ఆలయాల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. ఆదివారం జన్నారం మండల కేంద్రంలోని ఈర్లగుట్టపై వెలిసిన శ్రీ కేతేశ్వర కాంకాలమ్మ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఆలయాలను పున: నిర్మించడానికి ప్రత్యేక రూపకల్పన చేసింది అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొంతం శంకరయ్య, మధుసూదన్ రావు, బద్రి నాయక్, ఆలయ కమిటీ సభ్యులు ఎంఆర్ నర్సింగరావు, చిలువేరు నరసయ్య, రాజన్న పాల్గొన్నారు.

గిరిజన హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మంచిర్యాల

సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టల్స్ అవుట్ సోర్సింగ్, డైలీ వైస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదివారం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎన్.దివాకర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాలోని గిరిజన హాస్టల్ వర్కర్స్ అవుట్ సోర్సింగ్, డైలీ వైజ్ వర్కర్ల సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడి, సమస్య పరిష్కారం చేయాలని కోరారు. గత 5 నెలలుగా వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని, పండుగ పూట కూడా పస్తులే ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు, ఈ కుబేర్‌లో ఫ్రిజ్ చేసారని, ప్రభుత్వం ఇప్పటికైనా పెండింగ్ వేతనాలు ఏరియర్స్ తో సహా చెల్లించాలని అన్నారు. తపాలా శాఖ ప్రవేశ పెట్టిన రూ,10 లక్షల ఇన్సూరెన్స్ పాలసీని ఐటీడీఏ అధికారులు ప్రీమియం చేయించి, కార్మికులకు అమలు చేయాలన్నారు. దాంతో పాటు జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పీఫ్, ఈఎస్ఐతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజన్న, అరుణ, వజ్రమ్మ, ప్రేమ్ కుమార్, మహేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రజలకు నీతి నిజాయితీతో సేవ చేయడమే తన రాజకీయ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే స్వగ్రామం పాత మంచిర్యాలలో సుమారు రూ.50 లక్షల నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని అన్నారు. తాతయ్య రాజకీయ విమర్శలు ఆరోపణలు చేసే ప్రతిపక్ష నాయకుడు ప్రేమ్ సాగర్ రావు ఒక రాజకీయ దుర్మార్గుడని, తను కాంగ్రెస్‌లో ఉన్న సమయంలో అప్పటి ఎంపీ వెంకటస్వామి ఆధ్వర్యంలో తమతోపాటు సిర్పూర్ ఎమ్మెల్యే కోనప్ప అంగీకారంతో రాజకీయ పదవి వచ్చిందని గుర్తు చేశారు. తనకు రాజకీయ ప్రత్యర్థిగా రానని అప్పుడే కొడుకుపై ప్రమాణం చేశాడని గుర్తు చేస్తూ రాజకీయ దుర్మార్గుడు అంటూ ధ్వజమెత్తారు. సుమారు రూ.500 కోట్ల బ్యాంకు రుణాలు అప్పు ఉన్న వ్యక్తి రూ.200 చీరలతో ప్రజలను మభ్యపెడుతున్నట్లు ఎద్దేవా చేశారు. దైవ కార్యక్రమాల విషయాల్లో కూడా రాజకీయాలు చేయడం ఆయనకే పరిమితమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ పథకాలను అందిస్తూ నిజాయితీగల ప్రజాసేవకు ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్‌తో పాటు సభలో మాట్లాడిన నాయకులు కాంగ్రెస్‌ను ఉద్దేశించి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు బొలిశెట్టి సునీత కిషన్, గాదేసత్యం, ఎర్రం తిరుపతి, దుర్గం రాజేష్, రవీందర్ రావు, పోరేడి రాజు, తూముల వెంకట్రామయ్య, గొట్టిముక్కుల శంకరయ్య, అంకం నరేష్, వేముల గురువయ్య, పెంట ప్రదీప్, శెట్టి శ్రీనివాస్, నార్ల వంశి, రమేష్ యాదవ్, కుంటాల శంకర్, ఇస్సారపు మొగిలి, అమ్రోస్, నిమ్మ రాజుల కుమార్ పాల్గొన్నారు. కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణంకు అంబేద్కర్ పేరు పెట్టాలని దళిత సంఘాల నాయకులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

మందుబాబులకు అడ్డలుగా ప్రగతి మైదానం

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి మైదానం మందుబాబులకు అడ్డాగా మారింది. కొందరు మందుబాబులు రోజు సాయంత్రం వేళలో ప్రగతి మైదానంకు వచ్చి మద్యం సేవించి సీసాలను, చెత్తను అక్కడే వదిలి వెళ్ళిపోతున్నారు. దీంతో ప్రతిరోజు వ్యాయామానికి వచ్చే వారు చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. చుట్టు ప్రహరి ఉన్నా కూడా మద్యం సేవించేవారు లోనికి వచ్చి తాగుతుండడంతో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్లాస్టిక్ వాడకం నిషేధించిన కూడా మైదానం చుట్టూ ప్లాస్టిక్ కనిపిస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని మైదానానికి వచ్చే వారికి అసౌకర్యంగా ఉంటుందని వారు వాపోతున్నారు. నిత్యం వందలాది మంది ఉదయం, సాయంత్రం వ్యాయామం చేస్తుంటారు. మద్యం సేవించడమే కాకుండా కొంతమంది ఆకతాయిలు సీసాలను పగలగొడుతున్నారని, వాకింగ్ ట్రాక్‌పై నడిచే వారికి అసౌకర్యంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సంక్షేమం కోసమే యాజమాన్యం పనిచేస్తుందని చెప్పే అధికారులు, సింగరేణి ప్రగతి మైదానం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

యువకుడికి వాలీబాల్ కిట్టు అందజేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన యువకులకు పెంచికల్‌పేట్ ఎస్సై విజయ్‌కుమార్ వాలీబాల్ కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా యువకుడిని డ్రంక్ అండ్ డ్రైవ్, డయల్ హండ్రెడ్, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. క్రీడల్లో యువత రాణించాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగారాం, కానిస్టేబుల్ కొమురయ్య, యువకులు పాల్గొన్నారు

వధు, వరుల పరిచయ వేదిక

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి పద్మశాలి ఉద్యోగుల సంఘం, పద్మశాలి నస్పూర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నస్పూర్ కాలని సింగరేణి గార్డెన్‌లో పద్మశాలి వధు, వరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని చిలువేరు సదానందం అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సింగరేణి పద్మశాలి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవ రెడ్డి హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ ఈ పరిచయ వేదిక సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం సంతోషకరమని, ఎక్కడెక్కడో ఉన్న పద్మశాలి సోదరులకు ఈ వేదిక ద్వారా ఒక్కటి కావటం సంతోషకరమని అన్నారు. ఇలాంటి పరిచయ వేదికలు మళ్ళీ మళ్ళీ నిర్వహించాలని తమ సహకారం ఉంటుందని తెలిపారు. మార్కండేయ దేవాలయాన్ని మీరు చాలా బాగా నిర్మిస్తున్నారని, తొందరగా విగ్రహ ప్రతిష్టాపన చేయాలని, ఆ స్థలాన్ని సింగరేణి పద్మశాలి ఉద్యోగులకు ఇచ్చిందని, స్థలానికి సంబంధించి ఏమైన సమస్యలు ఉంటే పరిష్కారం చేస్తానని హామి ఇచ్చారు. ఈ పరిచయ వేదికలో అబ్బాయిలు 85, అమ్మాయిలు 10 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కార్యక్రమంలో సిరిపురం రవీందర్, మునుకుంట్ల రాజేశం, బొద్దున సత్యనారాయణ, బండి పద్మ, ఓల్లల రవీందర్, దిడ్డి బుచ్చయ్య కౌన్సిలర్ ఆడేపు మల్లికార్జున్, కందారపు రాములు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు సురేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరి ముస్కే సమ్మయ్య, రాష్ట్ర నాయకులు బొద్దున బాపుజీ, జిల్లా గౌరవ అధ్యక్షులు గడ్డం సుధాకర్, టౌన్ అధ్యక్షుడు రాం సత్తయ్య, ప్రధాన కార్యదర్శి నీలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి సన్మానం

పెంచికల్‌పేట్ : మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి తమ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎస్పీ చేతులమీదుగా ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై విజయ్ వారిని శాలువాతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కొమురయ్య, సతీష్, హరీష్, బ్లెస్సీ పాల్గొన్నారు.

జాతరలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయి

నవతెలంగాణ-జన్నారం

జాతరలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ అన్నారు. ఆదివారం మండల శివారులోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఈర్లగుట్టపై నిర్వహిస్తున్న కేతేశ్వర స్వామి జాతర మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ దేవాలయంలో ఉన్న స్వామి, అమ్మవార్లకు ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతరలు సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిరూపంగా ఉంటాయని తెలిపారు. జాతరకు మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తున్న సందర్భంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సంస్కృతులను గౌరవిస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రేఖా నాయక్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు మహ్మద్ రియాజుద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ముత్యం సతీష్, శ్రీపతి బుచ్చన్న వైస్ చైర్మన్ గోట రాజేష్ పాల్గొన్నారు.

భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు

రెబ్బెన : గంగాపూర్ జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. ఆదివారం మండలంలోని గంగాపూర్‌లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే జాతర మహోత్సవ నిర్వహణకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేసి జాతర విజయవంతానికి కృషి చేయాలని అన్నారు. గంగాపూర్‌లో ఫిబ్రవరి 4, 5, 6, తేదీల్లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే జాతర మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అభివృద్ధి పనులతో పాటు ఇతర పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అదేవిధంగా వేడుకలకు అంగరంగ వైభవంగా నిర్వహించాలని అన్నారు. ప్రజల, భక్తుల అభీష్టం మేరకు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీ శ్రీనివాస్, సింగరేణి జీఎం జి.దేవేందర్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సింగిల్‌విండో చైర్మెన్ కార్నాదం సంజీవ్, ఆలయ చైర్మెన్ ఓల్వోజు వెంకటేశం చారి, సర్పంచ్ పందిర్ల వినోద మధునయ్య పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్యవేదిక జన్నారం మండల కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఆ సంఘ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కడారుల నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్ గోజు శ్రీనివాసచారి, ఉపాధ్యక్షులుగా రేవెల్లి తిరుపతి, బాదంపెల్లి శ్రీనివాస్, దేవరకొండ మహేందర్, కోశాధికారిగా కొత్త శ్రీనివాస్, దానోజు శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా వేమునూరు శేఖర్‌లను ఎన్నుకున్నారు. సందర్భంగా నూతన అధ్యక్షుడు కడారుల నరసయ్య మాట్లాడుతూ ఈ కార్యవర్గాన్ని జిల్లా రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ నాయకుల సూచనల మేరకే ఎన్నుకోవడం జరిగిందన్నారు. సంఘ నాయకులంతా ఏకతాటిపై నడిచి సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి నూతన కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. సమావేశానికి హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయకూను కమిటీ నూతన సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రేఖా నాయక్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్యవేదిక భవనానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



నవతెలంగాణ-జన్నారం

సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ కళాశాల ఆవరణంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సీఎం సహాయ నిధి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ బడుగు బలహీన వర్గాల పక్షాన నిలుస్తోందని అన్నారు. వారి అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. పేదలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వృద్ధాప్య, వితంతు పెన్షన్లు అందిస్తూ, పేదలకు ఆసరాగా నిలుస్తుంది అన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ శీలం రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోట్ల రాజేష్ యాదవ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, జిల్లా అధికార ప్రతినిధి భరత్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు ముత్యం సతీష్, శ్రీపతి బుచ్చన్న స్థానిక సర్పంచ్ జక్కు భూమేష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ లెక్కల మల్లయ్య, బీవీఎస్ నాయక్, తోకల సురేష్, కొత్త తిరుపతి పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలంలోని పోతపెల్లి, ఎర్రగుంట గ్రామానికి చౌదరి మౌనిక రూ.36 వేలు, చంద్రశేఖర్ రూ.60 వేలు సీఎం రిలీఫ్ ఫండు చెక్కులను మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, బీఆర్ఎస్ నాయకులు వెంకటాచలం చౌదరి బండన్నతో కలిసి ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముత్తినేని తిరుపతి, బండి మహేష్, దుబ్బుల శంకరయ్య, బాపురావు, అశోక్, రామన్న, సురేష్ పాల్గొన్నారు.

రేపు భహిరంగా వేలం

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని కత్తరసాల గ్రామంలో ఫిబ్రవరిలో మహా శివరాత్రి పండగ పురస్కరించుకొని ఫిబ్రవరి 17 నుండి 19 వరకు జరిగే మహా శివరాత్రి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ జాతరలో దుకాణాల కోసం భహిరంగ వేలం వేస్తున్నట్టు ఆలయ సీఈఓ ఎం.రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో ప్రజల సమక్షంలో బహిరంగ వేలం పాట ఉంటుందని తెలిపారు. దుకాణాల వేలంపాటలో పాల్గొనేవారు ముందుగానే ఫిక్స్ డిపాజిట్ రూ.10 వేలు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫిక్స్ డిపాజిట్‌తో పాటు తమవెంట ఆధార్ కార్డ్ తీసుకు రావాలని కోరారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-జైపూర్

ఇటీవల మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు స్థానిక ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఈ నెల 17న ఇందారం శివారు రాజీవ్ రహదారిపై ఓవర్ ఫుట్పాత్ పై అనారోగ్యంతో బాధపడుతూ కనిపించిన వ్యక్తిని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మంచిర్యాల ఆస్పత్రిలో అడ్మిట్ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ గడ్డ మంజుల ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురిలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతుడు ఐదున్నర అడుగుల ఎత్తు నలుపు తెలుపు గీతలు గల షర్ట్ ధరించి ఉన్నాడని కోల ముఖం కలిగి ఉన్న ఈ వ్యక్తికి సంబంధించిన వారు జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఆదిలాబాద్ చౌరస్తాలో వాహనాల తనిఖీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ చౌరస్తాలో ఆదివారం ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకుండా హెల్మెట్ ధరించకుండా రోడ్డుపై నడుపుతున్న జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా అన్ని పత్రాలు దగ్గర ఉంచుకొని వాహనం నడపాలన్నారు. ప్రస్తుతం వాహనాలకు సంబంధించి అపరాధ రుసుములు అన్ని కూడా ఆన్ లైన్ చేయడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించి సరైన నిబంధనలు పాటించని వారి వాహనాల ఫోటోలు మాత్రమే అప్లోడ్ చేస్తామని అపరాధ రుసుము నిర్ణయించిన మేరకు వస్తోందన్నారు. మొత్తం 15 వాహనాలకు అపరాధ రుసుము రూ.3300 వేసినట్లు వివరించారు.

టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షుడి రాజీనామా

కాగజ్‌నగర్ : టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగిన అబ్దుల్ కమర్ తన పదవికి రాజీనామా చేసినట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను విధుల్లో చేరినప్పటి నుంచి యూటీఎఫ్‌లో ఉన్నానని, ఇటీవల జిల్లాలో జరుగుతున్న కొన్ని పరిణామాలు, కొందరి మోనోపాలిక్ విధానాలతో కలత చెంది సంఘం ప్రాథమిక సభ్యత్వానికి, జిల్లా ఉపాధ్యాక్ష పదవికి రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు పంపినట్టు తెలిపారు.